ఇష్టార్థసిద్ధి

శ్రీమతి కె రాజమ్మ, బి ఎస్ సి

"విజయా, విజయా"

"ఇదుగో వస్తున్నానే, అమ్మా" అంటూ మేడ మెట్లు దిగి వస్తూన్న విజయలక్ష్మిని చూచి అక్కడే నిల్చుంది సావిత్రమ్మ ఆ కొత్త పసుపు రంగు చీర కట్టుకుని వస్తూంటే, లక్ష్మీదేవే వస్తున్నట్టనుపించింది తల్లికి.

"ఏమే, ఎందుకే పిలిచావు?"

"మీ నాన్నగారు పిలిచారమ్మా ముందుగదిలో వున్నారు వెళ్ళి కనుక్కో" అని తన పనిమీద వెళ్ళి పోయింది

రామచంద్రరావుగారు, ఒక ఉత్తరాన్ని చేత్తో పట్టుకుని గదిలో ఇటూ అటూ పచారు చేస్తూండగా, ఎదురుగా వచ్చి నిల్చున్న కూతుర్ని చూచి "రామ్మా, ఇదుగో బందరు నుండి ఉత్తరం వచ్చింది చూడు" అని తన చేతిలో వున్న ఉత్తరాన్ని విజయ చేతికి ఇచ్చారు

దాన్ని విప్పి చదువుతున్న కూతురి మొహంలో కనపడ్డ మార్పులను చూచి "చూచావా అమ్మా మొగ పిల్లలను కన్నవాళ్ళంటే ఎక్కడలేని పొగరు వస్తుంది వారు వచ్చి నిన్ను చూచి పోయినారు, ఇప్పుడు యింకొక ఏడాది వరకూ కొడుకు పెండ్లి మాట మానుకున్నామంటే చిత్రంగా వుంది! ఇప్పుడు అనుకున్నారా యీ మాట? వీరు అనుకున్నంత కట్నాలూ కానుకలూ ఇవ్వలేకపోతే ఇదే జవాబు! వీరిండ్లలోనూ ఆడపిల్ల లుండరా?" కోపంలో ఆయనకి మాటలు వేగంగా వచ్చాయి

విజయ కూడా ఆ ఉత్తరం చూచి చాలా బాధపడ్డది తను కట్టుకున్న గాలి మేడలు ఎదటనే కూలిపోయినవి కాని దానికంటె ఎక్కువగా తండ్రి తను చేసిన ప్రయత్నాలు విఫలమైనందుకు దుఃఖిస్తున్నాడు చాలా బాధనిపించింది

"పోనీలెండి, నాన్నగారూ, చదువుకున్నవాళ్ళే ఇలా చేస్తే, మిగతావాళ్ళను 'అనడంలో ప్రయోజనం ఏమిటి? మీరు ఇంక కొంతకాలం ఈ విషయమే తలపెట్టవద్దు" అని అక్కడినుంచి లేచి లోపలికి వెళ్ళిపోయింది

రెండవ రోజున భోంచేసే టప్పుడు "నాన్నగారూ, నేటి పత్రికలో మన యింటిదగ్గరున్న స్కూలుకు ఒక ఉపాధ్యాయిని కావాలని చూచాను నేను దానికి ప్రయత్నించనా? ఇంట్లో ప్రొద్దు పోకుండావుంది" అన్నది విజయ

"నీకు ఎందుకమ్మా ఈ ఆలోచన తట్టింది?"

"ఇంట్లో యేం తోచటంలేదు దగ్గరే వున్నది గదా బడి యెప్పుడు వద్దనుకుంటే అప్పుడే మానుకోవచ్చు మీరు సరి అంటే ప్రయత్నిస్తాను"

"విజయా, నేను చెప్పేది విను నీ[illegible]నితో చేరడం నాకు ఇష్టంలేదు"

"నాతో చదువుకున్న వారిలో కొంధర్రు పిల్లలు పనుల్లో చేరారు నేను చదువు పూర్తిచేసి ఒక యేడాదిగా ఇంట్లో వుంటున్నానుగదా, పనిలో చేరితే తప్పేముంది?"

"తప్పు అని కాదు కొందరు చేరారంటే వారి తలిదండ్రులు దానికి ఒప్పుకున్నారు నాకు ఆడవాళ్ళు పనుల్లో చేరడం ఇష్టంలేదు. సంపాదన అని మొదలుపెట్టగానే పిల్లలకి ఎక్కడలేని స్వాతంత్ర్యం వచ్చి, మన మెందుకు ఇంకొకరు చెప్పినమాట వింటూ బతకాలి అన్న మనోభావం రాగానే వారిప్రకృతి మారిపోతుంది నీలాంటి

వాళ్ళు పెండ్లయేవరకూ పనిలో చేరుదాం అని చేరి, స్వేచ్ఛగా వుండి అలవాటై, పెండ్లి కాగానే భర్త చెప్పు చేతల్లో వుండి, అతనిస్తేనే కానీ డబ్బు లేకపోతే లేదన్న పరిస్థితి రాగానే చాలా కష్టపడతారు అదీగాక మొగవానికి తన భార్య తన మీదే ఆధారపడి, తను సంపాదించి తెచ్చిన డబ్బులే సంతోషంతో ఇద్దరికీ ఖర్చుపెట్టి, తన భార్యను సంతోష పెడుతున్నానన్న భావం అతనికి ఎంతో ఆత్మగౌరవాన్నిస్తుంది అదే అతనికి సంతృప్తి అతని సంతోషమే సంసారం యొక్క బలం ఇదే మన హిందూ కుటుంబాల్లో వున్న అందం పాశ్చాత్య దేశాల్లోలాగ భార్యాభర్త లిద్దరూ సంపాదిస్తూంటే ఒకరు యెక్కువ ఒకరు తక్కువ యేమని వాదం వచ్చి కుటుంబమే చెదరి పోతుందని నా నమ్మకం"

"అయితే అమ్మాయిని ఇంతవరకూ చదివించింది వృధాయే కదండీ" అన్నది సావిత్రమ్మ ఆమె సాధారణంగా తండ్రీ కుమార్తెల సంభాషణలలో జొరబడదు.

"చదువు ఎన్నటికీ వృధాగాదు చదువుకుంటాననిసరదా పడ్డది గనుక బి.ఏ. పూర్తి చేయించా ఇక చదువు చాలించి హిందూ స్త్రీకి కావలసిన ఇంటి పనులు నేర్చుకోమన్నా విజయా నీ చదువు డబ్బు సంపాదించేందుకు కాక, నీ పిల్లలనూ, నీ సంసారాన్నీ చక్కదిద్దుకుందుకు ఉపయోగించుకో నీవు తెచ్చే డబ్బు కంటే, నీ పిల్లలు పెద్దవారై, మంచివారన్న పేరు తెచ్చుకున్నప్పుడు కలిగే ఆనందాన్నే ఎక్కువగా యెంచాలి కాబట్టి ఉద్యోగం సంగతి మర్చిపో, కల్యాణం వచ్చినా, కక్కు వచ్చినా ఆగదంటారు పెండ్లి కాగానే నీ సంసారాన్ని నేర్పుతో నడిపే విధానాన్ని నేర్చుకొని వుండు ఇదే నా కోరిక" అని తమ అభిప్రాయాలన్నీ వెలిబుచ్చారు రామచంద్ర రావుగారు

విజయకు ఏం చెప్పాలో తోచలేదు ఎప్పుడూ నాన్నగారు ఇంతే ఉద్యోగం మాట వింటే ఉపన్యాసం ఇస్తారు ఇంట్లో కూర్చుని అనుభవించేవాళ్ళకి తెలుస్తుంది దాని బాధ స్నేహితుల ఇండ్లకు పోవడానికి, తనతో చదువుకున్న వాళ్లలో కొందరు పనుల్లో చేరారు, కొందరు అత్తవారిండ్లకు వెళ్ళిపోయారు కొందరు భర్త, పిల్లలు అంటూ ఆధోరణిలో మాట్లాడుతూవుంటే తానేం చేయగలదు? అందుకే వాళ్ళ ఇండ్లకు పోవడం తగ్గించింది ప్రొద్దున ఆఫీసుకు పోతే సాయంత్రం అలిసి ఇంటికి వస్తారు తండ్రి ఇంట్లో పనులు లేకపోతే రామాయణమో, భారతమో చేతపట్టుకుని కూర్చుంటుంది తల్లి తనతో పెరుగుతూన్న అక్కయ్య వసంత, మద్రాసులో కాపరం ఇలా తనతో మాట్లాడే వారుకూడా లేరు ఎంతసేపని కుట్లూ, ఇంటిపనులు వుంటాయి? తన పరిస్థితిని అర్థం చేసుకోలేదని నాన్నమీద కోపం వచ్చినా, చేసేదేమీ లేక యేడ్చేది విజయ

నాటితో ఉద్యోగం మాట మానింది విజయ ఇది జరిగిన నెల రోజుల వరకూ విజయ తండ్రి చెప్పినట్లే ఇంట్లో పనులన్నీ నేర్చుకుంది ఒక రోజున సాయంత్రం తండ్రి ఇంటికి రాగానే మద్రాసు నుంచి వసంతక్కయ్య వ్రాసిన ఉత్తరం ఇచ్చి "డిశంబరుకి వాళ్ళవూరు రమ్మని వ్రాసింది నాన్నా" అన్నది

"దానికేం వెళ్ళిరా సంగీతాలు, నాటకాలు, సభలు అంటూ ఈ నెలరోజులు చాలా బాగుంటుంది వెళ్ళి అక్కయ్యతో బాటు రెండు నెలలుండిరా" అన్నారు ఇది వినగానే చాలా సంతోషమైంది విజయకు, సరదాగా వుండి రావచ్చు గదా అని

మద్రాసు స్టేషనులో వసంత, మురారి, వారి కొడుకు ఆనందతో సహా వచ్చి, విజయను ఎదుర్కొన్నారు మురారికి మద్రాసులో ఏదో కంపెనీలో మేనేజరు పని. ఏదో వచ్చిన దాంట్లో సుఖంగా కాలం గడుపు తున్నారు

విజయ మద్రాసు వచ్చి కలలాగ పదిరోజులు గడిచి పోయినై అక్కడి సంగీతాలకీ, నాటకాలకీ, హాజరైయారు విజయ, వసంత, మురారిలు ఒక రోజున సాయంత్రం మురారి బజారుకెళ్ళాడు వసంత ఆనంద్‌కు వేరే బట్టలు వేస్తూంది విజయ ముందు గదిలో యేదో పుస్తకం చదువుతూ కూర్చునప్పుడు వీధి తలుపు తట్టిన చప్పుడైతే "విజయా యెవరో చూడమ్మా" అని వసంత అన్నది విజయ లేచి తలుపు తెరచి బైట వున్న మనిషిని చూచి ఉలిక్కి బడ్డది ఆ బైట నిలుచున్న మనిషి కూడా విజయను చూచి అలాగే నిల్చుండిపోయాడు వెంటనే సంబాళించుకున్న విజయ "యెవరు కావాలి" అని అడిగింది

"మురారి వున్నారా?" "లేరు ఇప్పుడే బజార్కి వెళ్లారు"

"అయితే' కుమారు వచ్చాడని చెప్పండి రేపు మళ్ళీ వస్తా" అని వెళ్ళిపోయాడు

లోపలకు వస్తూన్న విజయను చూచి "ఏం అలా వున్నావు విజయా? ఎవరు వచ్చింది?" అని అడిగింది అక్క

"యెవరో బావకోసం వచ్చారు కుమారట రేపు వస్తానన్నారు" ఆ వచ్చిన కుమారు బందరునుండి పెండ్లి చూపులకు వచ్చిన అతనేనని ఎలాచెప్పగలదు అక్కయ్యతో?

మురారి ఇంటికి రాగానే కుమారు వచ్చిన సంగతి చెప్పారు "అరెరే! అతను వచ్చే సరికి ఇంట్లో లేక పోయానే!" అనుకున్నాడు "ఎవరండీ అతను" అడిగింది వసంత "ఆ, మనవాడే బందరోట నెల రోజుల బట్టి నా అసిస్టెంటుగా పని చేస్తున్నాడు చాలా మంచివాడు"

రెండవ రోజున సాయంత్రం మురారి ఇంట్లోనే వున్నాడు వసంత విజయ లిద్దరూ బట్టల షాపుకి వెళ్లారు చెప్పిన ప్రకారం కుమారు వచ్చాడు ఏదో అదీ ఇదీ మాట్లాడుతూ కూర్చున్నారు ఇంతట్లో వసంత విజయ ఇంటికి రాగానే మురారి "నా భార్య మరదలు అక్కయ్యను చూడడాన్కి వచ్చింది" అంటూ కుమారుకు వసంత, విజయల్ని పరిచయం చేశాడు చిరునవ్వుతో విజయను చూస్తూన్న కుమారు "నమస్కారం" అని లోపలికి వెళ్ళిపోతున్న విజయను చూచి ఆశ్చర్యపోయాడు "ఇతనికి కట్నం ముఖ్యమే గాని, ఇంకేం అక్కరలేదు" అనుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది విజయ

విజయని మద్రాసులో చూస్తానని కలలో కూడా అనుకోలేదు మురారి కోసం వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు ఎదురు చూడని ఆ సన్నివేశంలో ఏం మాట్లాడాలో తోచక వెంటనే వచ్చాశాడు కానీ మరొక రోజు మురారి ఎదురుగా మాట్లాడుదామని ముందురోజునుంచి అనుకుంటున్న అతనికి విజయ ప్రవర్తన చూచి చాలా బాధ కలిగింది ఆ పెండ్లి చూపులనాడు, విజయ యొక్క విద్య, సంగీత జ్ఞానం, వినయం చూచి తను పెండ్లియాడితే విజయనే నని అప్పుడే నిర్ణయించుకున్నాడు తను వెంటనే పని ప్రయత్నంలో మద్రాసుకు వచ్చేసి నందున తరవాత జరిగిన సంగతులు తెలియవు గనుక, ప్రతి రోజూ తండ్రి దగ్గరనుండి ఉత్తరానికి ఎదురుచూస్తు న్నాడు పోనీ విజయకు ఇష్టంలేదేమో అనుకుంటే, ఆవిడ తనను చూచినప్పుడు ఆమె కళ్ళలో కనపడ్డ సమ్మతం, ఆనందం, ఎలా కాదనగలడు?

విజయ సరిగ్గా మాట్లాడక వెళ్ళిపోవడం చూచి మురారి కూడా ఆశ్చర్యపోయాడు ఎప్పుడూ అందరితోనూ కలసి సరదాగా మాట్లాడే మనిషి నేడు ఇలా ఎందుకు చేసిందా అనుకున్నాడు

ఆనంద్ పుట్టిన పండుగ రోజున మురారి కుమార్ని భోజనాన్కి పిలిచాడు ఆనాడు కూడా విజయ వడ్డనప్పుడు కానీ, తరువాత కానీ తల యెత్తి అయినా కుమారుని చూడలేదు ఇది గమనించి అతని మనస్సు చివుక్కుమన్నది దీనికే ఒకసారి ఆవిడనే అడిగి తెలుసుకొంటే సరిపోతుం దని సమయం కొరకు వేచియున్నాడు ఇప్పుడు మురారి ఇంటికి తరచు వస్తూన్న కుమారుకి తను వేచియున్న సమయం కొద్ది రోజులలోనే దొరికింది

ఆరోజు మురారి, వసంత ఇంట్లో లేరు ఆనందాన్ని ఆడిస్తూ విజయ ఒక్కతే కూర్చునుంది కుమార్ ఈ సందర్భాన్ని ఉపయోగించదలచి "ఏం విజయ! నన్ను ఎప్పుడూ చూడనిదానివలె నటిస్తున్నావు?"

బదులేమీ రాలేదు "పెద్దవాళ్ళు వుత్తరాలు జరుపుతుండాలి ఇంకా కొద్ది రోజులలోనే తాంబూలాలు తీసుకుంటారనుకున్నాను నీకు ఇష్టంలేదా?" అన్నాడు కుమార్

"నా ఇష్టాయిష్టాలతో ఇప్పుడు పనిలేదు ఉత్తరాలు కూడా మానుకున్నారు!"

"ఆ! ఎందుకని?"

"మీరు కోరిన డబ్బు ఇవ్వడాన్కి మా నాన్నగారు సమ్మతించలేదు నేనుకూడా ఒద్దన్నాను అందుకని మీ వాళ్లు మానుకున్నారు"

"డబ్బా! ఎవరడిగారు?"

"ఏం తెలియని వారివలె అడుగుతున్నారే! మీనాన్నగారే నెల క్రితం మా నాన్నగారిస్తానన్న ఐదు వేల కట్నం చాలదని కబురంపారు వేలకు వేలు డబ్బు లాగడాన్కి ముందు వెనుక చూడని విద్యావంతులుకూడా వుంటారని నేననుకోలేదు"

"ఇదంతా కొత్తగా వింటున్నాను నేను మా నాన్నగారితో కట్నం మాటే ఎత్తవద్దన్నాను ఎందుకా ఇంకా ఉత్తరం రాలేదనుకున్నాను ఇదా సంగతి!"

"అయితే మీకు కట్నం తీసుకోవడం అసమ్మతమేనా?"

"ఆ, ఎప్పటికీ నాకా ఆలోచనే లేదు. మొన్న నీవు

'నమస్తే' అని వెళ్ళిపోగానే ఆశ్చర్యపోయా ఇప్పుడంతా అర్థమౌతూంది ఇప్పుడేం చేద్దాం?"

"చేయడానికేముంది! మీ నాన్నగార్కి కట్నం ఆశ వుంది నేను మా నాన్నగారిని కట్నమే ఇవ్వకూడ దంటు న్నాను. ఈ సమస్య పరిహారమయ్యే దారే లేదు!"

"లేదని వూరికే వుండడమా! మురారితో కలిసి ఆలో చిద్దాం!" అంటూండగానే మురారి, వసంత ఇంట్లోకి వచ్చారు

కుమార్‌ని చూడగానే "ఎంతసేపయిందోయ్ నీవు వచ్చి?" అంటూ ప్రక్కన కూర్చున్నాడు మురారి "ఇప్పుడే వచ్చాను మీరు ఇంట్లో లేరంటే కొంత సేపు చూసిపోదా మని కూర్చున్నాను మీతో మాట్లాడాలి" అంటూ కుమార్ విజయ వేపు చూడడం, విజయ సమ్మతి తెలియజేస్తూ తల వూపడం చూచి మురారి, వసంతా ఇద్దరూ నిర్ఘాంత పోయారు. నాడు మర్యాదకైనా ఒక మాట మాట్లాడని విజయ నేడు ఎంతో చనువుతో ప్రవర్తిస్తూందేనని కుమార్ చెప్పిన సంగతులు విన్నాక వారిద్దరూ ఆశ్చర్య చకితులయ్యారు

"అమ్మ దొంగా! ఇదంతా మాకు తెలియకుండానే జరిపారన్నమాట!" అని విజయని వేళాకోళాలు చేస్తూ "అయితే ఇప్పుడు ఏం చేయాలని మీ ఆలోచన?" అని ప్రశ్నించాడు మురారి

"మీరు నాకు సహాయం చేస్తానంటే ఈపని అను కూలంగా ముగించగలను నేను రేపే మా నాన్నకి వుత్తరం వ్రాస్తాను నాతో పనిచేసే శ్రీ మురారి యొక్క మరదల్ని పెండ్లి చేసుకోడానికి నిశ్చయించానని దానిపైన యేం జరుగుతుందో చూద్దాం" అన్నాడు

సరే నని ఒప్పుకున్నారు మిగతా వారు

కొడుకు దగ్గరనుండి వచ్చిన ఉత్తరాన్ని చూడగానే బందరులో రంగారావు గాబరాతో యెవరో, యేకులమో అని భయపడుతూ, స్వయంగానే విచారించి వస్తే మంచి దని తిరుగుబండిలోనే బయలుదేరి మద్రాసు చేరుకున్నారు

తన వుత్తరానికి వెంటనే వచ్చిన తండ్రిని చూచి కొంత భయపడ్డా, ఇదీ ఒకవిధాన మంచిదే అనుకున్నాడు కుమార్ కుశల ప్రశ్నలు కాగానే ముఖ్యవిషయానికి వచ్చారు రంగారావుగారు

"ఏం కుమార్! ఏమిటి నీవు వ్రాసిన సంగతి! నిజమేనా?"

"అవును నాన్నగారూ నిజంగానే వ్రాశాను మురారి మా మేనేజరు మనవాళ్ళే. గౌరవంగల కుటుంబమే ఇంతకీ నాకు పిల్ల నచ్చింది గనుక చేసుకోదల్చుకున్నాను"

"పెద్దవాళ్ళెవరూ లేనట్టే నువ్వే అంతా నిశ్చయించు కున్నట్టున్నావే? నేనూ, మీ తల్లీ వున్నసంగతే మర్చి పోయావా?"

"లేదు నాన్నగారూ! ఇన్ని రోజులూ మీ మీద భారం వదలి నేను ఊరుకున్నందుకు ఏం జరిగింది? మీరు ముందు చూచిన రామచంద్రరావుగారి సంబంధం ఏమ యింది? నేను కట్నం తీసుకోకూడదని ఎంత చెప్పినా మీరు ఐదువేల రూపాయిలు కూడా చాలదని కబురంపా రటగా?"

"వారే ఇస్తామన్నారు ఐదువేలు నేనేం ఇంతని అడగ లేదు యెవరాచెప్పింది?"

"అయిదు వేల రూపాయలు! వారు యెన్నేళ్ళు కష్టపడి సంపాదించిందో? మీకు ఎందుకు అంత డబ్బు? నా చదు వుకు ఖర్చుపెట్టిందన్నారానీ అంటారేమో నన్ను మీరు చదివించినట్టే వారు వారి కూతుర్ని కూడా చదివించారుగదా బి ఏ దాకా వారికి మాత్రం డబ్బు ఖర్చు కాలేదంటారా? ఈ పెండ్లితో వారికి కూతురి బాధ్యత తీరిపోతుందా? వాళ్ళ గోళ్ళమీద కొట్టి దాచుకున్న డబ్బు మనకేం సంతోషాన్ని ఇవ్వదు అందుకనే నేనిప్పుడు చెప్పిన అమ్మాయిని ఒక దమ్మిడీకూడా కట్నం లేకుండా పెండ్లి చేసుకో దల్చుకున్నాను"

"నిన్ను ఇంతా పెంచి పెద్దవాణ్ణి చేసినందుకు మంచి మర్యాదే ఇచ్చావులే!"

"నాన్నగారూ ఈ విషయంలో మట్టుకు మీరు బాధ్య తంతా నామీద వదలాలి ఇంకే విషయంలోనైనా మీ మాట కాదంటే ఒట్టు!"

"ఒట్లకేంలే! అయితే ఇప్పుడు నీ ఇష్టం వచ్చినట్టు జరగాలి అంటావు అంతేనా? కానీ నీవే మిగతా విష యాలు మాట్లాడి మమ్మల్ని రమ్మని వ్రాస్తే ఆ వేళకు వస్తాము నేను ఇప్పుడే వూరికి వెళ్ళిపోతా," అంటూ

సంచీని చేతబుచ్చుకుని లేచాడు ఆ వేళకు సరిగ్గా లోపలకు వచ్చిన మురారిని చూచి, కుమారు

"ఈయనే నాన్నగారూ నేను చెప్పిన మురారి" అంటూ పరిచయం చేసాడు

"నమస్కారం" అని మురారి అన్నా, బదులేమీచెప్పక, ధుమ ధుమలాడే మొహంతో నిల్చున్నారు రంగారావుగారు

కుమారు మొహం చూచి సంగతంతా తెలిసింది అని గ్రహించి, "మిమ్మల్ని ఇలా కలుసు కోవడం చాలా సంతోషం. నేనే మీవూరు రావాలనుకున్నాను మీరు అంగీకరిస్తే నా మరదల్ని మీ కుమారునకు ఇచ్చి వివాహం చేయ నిశ్చయించాము పెద్దలు మీరు ఆశీర్వదించాలి" అన్నాడు మురారి

"హుం పెద్దలు! పెద్దలని మీరేం మర్యాదించారు? అంతా కుదుర్చు కున్నాక నాకు తెలియచేసి అంగీకరించా లట! ముందుకు కూడా మీరే అన్ని విషయాలు మాట్లాడి లగ్నం ఎప్పుడో తెలియజేస్తే వస్తాను అదీ వాడి తల్లి యేడుస్తుంది గనుకనూ," అంటూ తను లొంగిపోయానని తెలిపాడు

'అమ్మాయిని మీరు కూడా ఒకసారి చూస్తారా?" మురారి అడిగాడు మర్యాదగా

''నేను చూడడం ఎందుకు? ముఖ్యమైనవాడే ఒప్పుకున్నాడుగా! నా అభిప్రాయం అనవసరం'' అన్నారు

వాళ్ళిద్దరూ ఎంత చెప్పినా వినక ఆనాడె బయలుదేరి బందరు వెళ్ళిపోయారు రంగారావు

జరిగినదంతా మామగార్కి వుత్తరం వ్రాశాడు మురారి రామచంద్రరావు వీరు పన్నిన పన్నాగాన్కి ఎంతో ఆశ్చర్య పోయారు పెద్ద వాళ్ళని కాదని, వారు కార్యాన్ని, ఇంత వరకూ సాధించారని ఖేదపడ్డా, చివరకి విజయ తను అన్నట్లే కట్నం లేకుండా మొగుణ్ణి సంపాయించినందుకు చాలా సంతోష పడ్డారు

పెండ్లినాడు కోపంతో యెవరితోనూ మాట్లాడకుండా ఇటూ అటూ పచారు చేస్తూన్న రంగారావుగారు ఎదురుగా వచ్చి నిల్చున్న రామచంద్రరావుగార్ని చూడగానే నిర్ఘాంత పోయాడు 'ఇతనెక్కడ వచ్చాడా?' అని

"క్షమించాలి ఇంతవరకూ ఎవడబ్బాయి అని తెలియపరచని తప్పంతా మీ అబ్బాయిదే చిన్నవాళ్ళు వాళ్ళేదో తామే ముందు నిల్చుని ఇంత వరకూ తెచ్చారు మనం పెద్దవాళ్ళం వున్నసంగతికూడా మర్చిపోయినట్లు ప్రవర్తించారు మనమే వార్ని క్షమించి వూరుకోవాలి" అని రామచంద్రరావు అన్న మాటలు విని అక్కడే కుర్చీలో కూలబడ్డారు రంగారావు

'నాదే ఒప్పుకుంటే ఐదు వేలన్నా చేతిలో పడేవి ఆశకు పోతే అదే సంబంధం అసలే కట్నం లేకుండా చేసుకోవలసి వచ్చిందే' అని దుఃఖించాడు రంగారావు

కుమారు, విజయ ఇద్దరూ వారు పొందిన విజయాన్కి ఎంతో సంతోషించారు ★

★ స్వప్నవాసి ★

అనువాదం శ్రీ ఆర్ సోమసుందర్

నా స్వప్నాంబరమున తేలిపోవు సంధ్యా మేఘం నీవు

ప్రేమాభిలాషలతో సదా నిన్ను చిత్రింతును, నిన్నలంకరింతును

నా యనంత స్వప్నలోకవాసా! నీవు నా వాడవు ..! నీవు నా వాడవు!

నా సాంధ్యగానాలమూర్తి! నా హృదయాకాంక్ష ప్రదీప్తితో నీ చరణ కమలాలు అరుణ రాగమును పొందినాయి

నా వేదనా మదిరాస్వాదనంతో నీ అధరములు అత్యంత మధురతను బడసినాయి

నా వివిక్త స్వప్నవాసా! నీవు నా వాడవు .. నీవు నా వాడవు!

నా సిరావలోకనాగాధ సంచారీ! నా కోర్కె నీడ నీ నేత్రములను నెల్వమ్మెనర్చింది.

ప్రేమైకమూర్తీ! నా గానజాలమందు నిన్ను పట్టి బంధించినాను

నా అమర స్వప్నవాసా! నీవు నా వాడవు... నీవు నా వాడవు! ★

[రవీంద్రుని "తోటమాలి"నుండి]